## 20

# బ్రతుకు తీపి

ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్ నిశ్శబ్దంగా వుంది. లోపలికి వెళ్ళే గుమ్మం ముందు బెంచీల మీద ఇద్దరు మగవాళ్ళు కూర్చుని వున్నారు. నెమ్మదిగా ఏదో మాట్లాడుతున్నారు.

రెండంతస్తులు ఎక్కి అక్కడికి చేరుకున్న పార్థసారథి ఒక నిమిషం నిలబడి గాఢంగా ఊపిరి తీసుకున్నాడు. అలవాటు లేకుండా అంతపైకి ఎక్కిరావడం వలన ఆయాసం వచ్చి రొప్పుతున్నాడాయన. అరవై ఏళ్ళ వయసులోనూ ఆరోగ్యంగా వున్నానని గర్వపడతాడు ఆయన. కానీ ఆరోజు మూడోసారి క్రింద నుండి పైకి రావడంతో "ఇంకోసారి ఈ అంతస్తుకు వచ్చానంటే నేనే ఇక్కడ చేరాల్సివస్తుందేమో" అనుకున్నాడు.

తలుపు తీసుకొని నెమ్మదిగా లోపలికి నడిచాడు. పొడువుగా వున్న వరండాకు అటూ ఇటూ వరుసగా వున్నాయి చిన్న చిన్న గదులు. బయట నుండే పేషెంటును చూడ గలిగేట్టు గాజు పలకలు బిగించించారు గోడలకు బదులుగా

మూడో నంబరు గది ముందు ఆగి లోపలికి చూసాడాయన.

ప్రొద్దున్న ఎలా వదిలివెళ్ళాడో అలాగే పడుకుని వుంది మీనాక్షి. ముక్కుకు తగిలించిన ఆక్సిజన్ గొట్టాలు, చేతికి పెట్టిన డ్రిప్, ఆమె తలవైపున వున్న ఇసిజి మెషిన్‌లో ఆమె గుండె కదలికను చూపిస్తున్న మానిటర్ ఇవన్నీ ఆమె పరిస్థితిని విశదం చేస్తున్నాయి. నెమ్మదిగా లోపలికి నడిచాడు.

బరువుగా ఊపిరి తీస్తున్నది మీనాక్షి... నిద్రపోతున్నదేమో అనుకుని వంగి చూశాడు. ఆమె కళ్ళు తెరుచుకొనే వుంది.. గోడవైపు చూస్తున్నదల్లా కళ్ళు విప్పి ఆయన కేసి చూసింది. ఆమె చూపులు నిరాసక్తంగా వున్నాయి.

నిన్నటి దాకా పగలల్లా క్షణం విశ్రాంతి లేకుండా చక చక తిరుగుతూ పనులు చక్కబెట్టుకున్న తన ఇల్లాలు, ఇరవైఅయిదు సంవత్సరాల సహచరిని ఆ స్థితిలో చూసిన పార్థసారథి కళ్ళు చెమర్చాయి. తన కంట తడి మీనాక్షి చూడలేదని తెలుసు ఆయనకు.

చిన్న తల నొప్పి వచ్చినా, జ్వరం వచ్చినా ఆయనకు నెమ్మదించేదాకా ఆవిడకు ఊరట వుండేది కాదు.

గబుక్కున కళ్ళు తుడుచుకున్నాడు. మంచం పక్కనే వున్న బల్లను మంచం

దగ్గరగా జరిపి ఆమె తలవైపున కూర్చున్నాడు. ఆమెనుదుటి మీద నెమ్మదిగా చేయి వేసి సున్నితంగా నిమిరాడు.

ఆయన చేతి స్పర్శ ఆమెకెంతో ఇష్టం. "ఈ ప్రపంచంలో నాకు భయం లేదు అనిపిస్తుంది" అనేది ఎన్నిసార్లు.

మీనాక్షి ఆయన ముఖం వైపు చూసింది. ఆమె కళ్ళలో ఏభావమూ ద్యోతకం లేదు.

"అబ్బాయి రాత్రికి వచ్చేస్తాడు. బయల్దేరినట్టు ఫోను చేసాడు... అమ్మాయి రేపు ఉదయానికి ఇక్కడ వుంటుంది". నెమ్మదిగా చెప్పాడు.

అర్థమయిందన్నట్టు చూసి వూరుకుందావిడ. ప్రాణాలన్నీ వాళ్ళమీదే పెట్టి పెంచుకున్న కొడుకు, కూతురు తన కోసం రెక్కలు కట్టుకుని వస్తున్నారన్న కబురు ఆమెలో ఏ సంచలనాన్నీ కలిగించలేదు.

"అబ్బాయి వచ్చేస్తే అన్నీ తనే చూసుకుంటాడు" తనకు తను చెప్పుకుంటున్నట్టుగా అన్నాడు పార్థసారథి.

ఆ 'అన్నీ' అనడంలో అనాలోచితంగానే ఎంతో అర్థం పలికింది.

ఏభావమూ వ్యక్తంకాని చూపులతో అలాగే నిశ్చలంగా వుండిపోయింది మీనాక్షి.

ఇంతలో ఆమె పనిచేసే ఆఫీసులో కొలీగ్స్ ముగ్గురు ఆడవాళ్ళు చప్పుడు కాకుండా వచ్చారు.

రాగానే ఆయనవైపు చాలా సానుభూతిగా చూసారు.

ఆయన ఇబ్బందిగా కదిలి, నెమ్మదిగా లేచి బయటకు నడిచాడు. ఆవిడను పలుకరించకండి అని చెప్పి మీనాక్షి కళ్ళు మూసుకుంది.

"పిల్లల చదువులు పూర్తయ్యాయి. ఇద్దరు పిల్లలకి పెళ్ళిళ్ళు కూడా చేసేసింది. ఇక మూడో పిల్ల పెళ్ళి ఒక్కటీ అయితే బాధ్యతలన్నీ పూర్తయినట్టే మీనాక్షికి" అంది ఒకావిడ. పిల్లల్ని పెంచి పెద్దవాళ్ళని చేసి చదువు చెప్పించి పెళ్ళి చేసేస్తే ఇక బ్రతకక పోయినా ఫరవాలేదన్నట్టు."

సంసార బాధ్యతలన్నీ వాళ్ళయన చూసుకుంటాడు గనుక మీనాక్షి ఆఖరి కూతురు పెళ్ళి గురించి కూడా దిగులు పడనక్కర్లేదు. ఇన్‌డైరెక్ట్‌గా మీనాక్షికి ధైర్యం చెబుతున్నట్టు అంది మరొక ఆవిడ.

"మీనాక్షి అదృష్టవంతురాలులే... వడ్డించిన విస్తరి లాంటి జీవితం. పిల్లలకు మంచి చదువులబ్బాయి. తనకీ చిన్న వయసులోనే ప్రమోషను వచ్చింది. అనుభవించాల్సినవన్నీ అనుభవించేసింది" మూడో వనిత అంది.

మీనాక్షికి ప్రమోషన్ వచ్చినప్పుడు ఏగొప్పతనమూ లేని ఆమెకు వున్నత పదవి రావడం తమకు అన్యాయం జరిగినట్టేనని బహిరంగంగానే అసూయవెళ్ళగక్కిన వాళ్ళలో ఈవిడ ఒకతి. మీనాక్షి వరుసగా పరీక్షలలో ఉత్తీర్ణురాలు కావడం అంచెలంచెలుగా ఎదిగి పోవడం అక్కడకు వచ్చిన ఆ ముగ్గురు స్త్రీలకూ మనస్తాపం కలిగించి ఆమెను వారికి కాస్త దూరం చేసింది.

మీనాక్షి మెలకువగానే వున్నా వారు లోపలికి రాగానే కళ్ళు మూసుకునే వుండి

పోయింది.వాళ్ళ మాటలు ఆమె చెవిన పడుతూనే వున్నాయి.కానీ చిత్రంగా వాళ్ళ అభిప్రాయాలు ఆమెలో ఎటువంటి భావోద్వేగాన్నీ కలిగించలేదు.

అయిదు నిముషాలు నిలబడి తమ విధి పూర్తయినట్టు నెమ్మదిగా బయటకు నడిచారు ఆ ముగ్గురు మహిళలు.

"నాన్నా అమ్మకెలావుంది? అంత ఆరోగ్యంగా వుండేది ఇంత హఠాత్తుగా ఈ గుండెపోటు రావడమేమిటి? డాక్టరు ఏమన్నాడు?" పార్థసారథి లోపలికి వస్తుండగానే కొడుకు దూసుకు వచ్చాడు.

"ష్... మెల్లగా... ఎవర్నీ లోపలికి రానివ్వొద్దన్నాడు డాక్టరు. రేపు గడిస్తే గానీ ఏమీ చెప్పలేనన్నాడు" గద్గదికంగా పలికింది పార్థసారథి గొంతు.

'నలభై ఎనిమిది గంటలు గడిస్తే గానీ ఏ మాటా చెప్పలేమని' ఆమెను చేర్పించిన వెంటనే హార్ట్ స్పెషలిస్ట్ సుమంత్ కుమార్ చెప్పడం మీనాక్షి విన్నది.ఆ మాట తెలియక ఆయన రహస్యంగా కొడుక్కి చెప్పాడు.ఇప్పటికి ఇరవైనాలుగు గంటలు గడిచాయి

మీనాక్షి కళ్ళు విప్పి కొడుకు వైపు చూసింది.ఆరడుగుల పొడువుతో పుష్టిగా ఆరోగ్యంగా వున్నాడు శేషగిరి.చిన్నప్పుడు ఎముకలు కనబడుతూ అనారోగ్యంగా వుండేవాడు.ఎప్పుడూ జలుబో, జ్వరమో వుంటూనే వుండేది. మీనాక్షికి ఎంతసేపు కొడుకు ఆరోగ్యం గురించిన చింతే వుండేది.

"అమ్మా నేనొచ్చేసాను... ఏం దిగులు పడకు... రేపు చెల్లాయి వచ్చేస్తుంది" తల్లి దగ్గరగా వచ్చి నెమ్మదిగా చెప్పాడు శేషగిరి.

ఒక నిమిషం కొడుకు వైపు చూసి కళ్ళు మూసుకుంది మీనాక్షి.ఆమె చూపులలో ఏ భావమూ కనిపించలేదు.

"అమ్మా నాకు ప్రమోషను రావాలని నీ ఇష్టదైవం వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నావు కదూ! నీ మొక్కు ఫలించింది.నిన్ననే నాకు ప్రమోషను ఆర్డరు అందింది". తల్లి చేతి మీద చేయివేసి చెప్పాడు శేషగిరి.

మీనాక్షి కళ్ళు తెరిచి అతని వైపు భావరహితంగా చూసి మళ్ళీ కళ్ళు మూసుకుంది.

"నాన్నా నేను ఇంటికి వెళ్ళి స్నానం భోజనం కానిచ్చి వస్తాను. రాత్రికి నేను ఇక్కడే వుంటాను.నేను వచ్చాక మీరు ఇంటికి వెళ్ళి విశ్రాంతిగా నిద్రపోవచ్చు" బయటకు వస్తూ అన్నాడు శేషగిరి.

పార్థసారథి తలవూపి నిస్సత్తువగా బయట బెంచీమీద కూర్చున్నాడు.

తెల్లవారింది.స్టేషను నుండి తిన్నగా హాస్పిటలుకు వచ్చింది వారిజ.

వారిజ వచ్చేసరికి నిద్ర లేచింది మీనాక్షి.అరగ దీసిన గంధం చెక్కలా నాజూకుగా వుండే వారిజ కొంచెం నునుపు తేరింది.

"అమ్మా...పెళ్ళయి అయిదేళ్ళయినా నాకు పిల్లలు కాలేదని దిగులు పడ్డావు.మంచి వార్త చెప్పాలనుకున్న సమయంలో ఇలా ముంచుకొచ్చిందేంటమ్మా"

వారిజ ఏడుపు గొంతుతో అంది. తన కోసం అమ్మచేసే పూజలు ఆమెకు తెలుసు మీనాక్షి కూతురి ముఖం వైపు చూసింది. ఆ పిల్ల దుఃఖం ఆమెను కదలించలేదు.

వారిజ తల్లి చేతిని తన కడుపుకు ఆనించి "మూడో నెల..." అంది.వారిజ కళ్ళలో మెరుపు మీనాక్షిలో ఏ స్పందననూ కలిగించలేదు.నిర్లిప్తంగా చేయివెనక్కి తీసుకుని కళ్ళు మూసుకుంది.

పది గంటలవుతుండగా పార్ధసారధి చిన్న కూతుర్ని వెంటబెట్టుకుని వచ్చాడు.

"మీనాక్షీ! ఎలావుంది? నీరజ వచ్చింది చూడు" అన్నాడు భార్య దగ్గరగా వెళ్ళి.మీనాక్షి కళ్ళు విప్పి నీరజ వైపు చూసింది.

"నీ మనసుకు ఊరట కలిగించే శుభవార్త చెప్పనా మీనాక్షి? మొన్న పెళ్ళి వారొచ్చి అమ్మాయిని చూసి వెళ్ళారా? వాళ్ళకు నీరజ నచ్చిందట.'తొందరలోనే ముహూర్తం పెట్టుకుందాము' అంటూ ఫోను చేసారు అన్నాడు పార్ధసారధి.

తండ్రి మాటలు వింటున్న నీరజ ముఖం సిగ్గుతో ఎఱ్ఱబడింది.కళ్ళలోకి కొత్త కాంతి వచ్చింది.మెరుస్తున్న కళ్ళతో అమ్మ వైపు చూసింది.మీనాక్షి కళ్ళలో ఒక రకమైన రిలీఫ్ లాంటి భావం కనబడింది.

నీరజకు ఇరవై మూడేళ్ళు నిండాయి. ఎమ్.ఎ చేసింది. అందంగా వుంటుంది. ఉద్యోగ ప్రయత్నంలో ఏవో పరీక్షలు రాసింది.తెలివైనది గనుక ఏదో ఒక దానిలో సెలక్షను వస్తుందని అందరికీ నమ్మకం. అయితే రెండేళ్ళుగా ప్రయత్నిస్తున్నా అదేమిటో ఒక్క సంబంధమూ కలిసి రాలేదు ఆపిల్లకి.పార్ధసారధి ఆ విషయాన్ని తేలికగానే తీసుకున్నాడు. ఇవాళ కాకపోతే రేపు మంచి కుఱ్ఱాడే దొరికి ఆ పిల్లకు పెళ్ళి అవుతుందని ఆయన ధీమా. కానీ మీనాక్షి మాత్రం తెగ బెంగపడి పోయింది. ఒక వయసుదాటాక కన్యలుగా మిగిలిపోయి ఉద్యోగం చేస్తున్న వారిని రోజూ చూస్తున్నది గనుక కూతురి పెళ్ళి గురించి ఒకటే తాపత్రయ పడిపోయింది.

సాయంత్రం ఏడుగంటలవుతుండగా శేషగిరి భార్య,మీనాక్షి కోడలు అలక నంద వచ్చింది.ఆమె వస్తున్నట్టు ఎవరికీ తెలియదు శేషగిరికి తప్ప.తిన్నగా హాస్పటల్‌కే వచ్చింది ఆమె.

ఎంక్వయిరీ కౌంటర్‌లో కనుక్కుని అత్తగారి గదికి వచ్చింది. ఆమె వచ్చేసరికి మీనాక్షి కళ్ళు మూసుకుని పడుకొని వుంది.

"అమ్మా నీ కోడలు నిన్ను చూడాలని పరిగెత్తుకు వచ్చింది చూడు" అన్నాడు శేషగిరి.

మీనాక్షి కళ్ళు తెరవలేదు. ఆవిడ నిద్రలోవుందో మెలుకువగా వుందో అర్థం కాలేదు వాళ్ళకి.

"మా అత్తగారు మీనాక్షిగారు ఆ మదురై మీనాక్షి అంత అందంగానూ వుంటారు పోతే ఆవిడలా నలుపు కాదు దబ్బపండు ఛాయ" అని అడిగే సరికి నర్సు వెంటనే అత్తయ్యగారి గురించి గుర్తు చెప్పేసింది తెలుసాండీ?" అలకనంద అంది.

మీనాక్షి కళ్ళు తెరిచి కోడలి వైపు చూసింది.

"ఈ రాత్రికి నేను అత్తయ్యగారికి తోడుగా వుంటాను... మీరందరూ ఇంటికి వెళ్ళి శుభ్రంగా నిద్రపోయి ప్రొద్దున్నే రండి' అంది అలకనంద.

"డాక్టరు ఈ పక్కగదిలోనే వుంటాడు.నర్సు రాత్రి రెండుసార్లు వచ్చి

చూస్తుంది. నిద్రపోకుండా జాగ్రత్తగా చూస్తుండాలి. ఇవాళ రాత్రి గడిస్తే గండం గడిచినట్టే...." అన్నాడు శేషగిరి.

"మేమిద్దరం కూడా ఇక్కడే వుంటాము" వారిజ, నీరజ కోరస్‌గా అన్నారు.

వాళ్ళిద్దరూ మాట్లాడుతున్నది తన గురించేనన్న స్పృహ లేనట్టు నిర్లిప్తంగా చూసి కళ్ళు మూసుకుని పడుకుంది మీనాక్షి.

"పేషెంట్ దగ్గర ఒకరి కంటే ఎక్కువ మందిని వుంచనివ్వరు. ఎవరుంటారో మీరే నిశ్చయించుకోండి." అన్నాడు శేషగిరి.

"ఆడవాళ్ళను వుండమనడం కన్నా నువ్వే వుండరాదట్రా? ఎందుకైనా మంచిది"? అన్నాడు పార్ధసారధి.

"సరే మీరందరూ వెళ్ళండి. ప్రొద్దున్నే ఆరు గంటలకల్లా వచ్చేయండి." అన్నాడు శేషగిరి.

"అమ్మా మేం వెళ్ళిరామా?" తల్లి దగ్గరగా వచ్చి డగ్గుత్తికతో అడిగారు వారిజ,నీరజ.

"అత్తయ్యా ! ప్రొద్దున్నే వచ్చేస్తాము సరేనా"? అంది అలకనంద.

"మీనాక్షీ ! నన్నే వుండమంటావా పోనీ?" అని పార్ధసారధి అడిగాడు.

వాళ్ళందరి వైపు చూసి కళ్ళు మూసుకుని పడుకుంది మీనాక్షి.

మర్నాడు ఏడు గంటలకు కుటుంబ సభ్యులు మొత్తం మీనాక్షి గది ముందే వున్నారు. వాళ్ళందరి ముఖాలలో ఆందోళన స్పష్టంగా కనబడుతుంది.

లోపల మీనాక్షిని పరీక్షిస్తున్న డాక్టరు బయటకు రాగానే అతన్ని చుట్టుముట్టారు.

"ఆవిడ ప్రమాదంలో నుండి బయట పడినట్టే... నాలుగు రోజులలో ఇంటికి తీసుకు వెళ్ళిపోవచ్చు" అన్నాడు డాక్టర్ సుమంత్ కుమార్.

తలుపు తీసే వుండడం వలన ఆయన మాటలు మీనాక్షి కూడా విన్నది.

మీనాక్షి భర్త, కోడలు, కూతుళ్ళు అందరూ కొండంత బరువు తీరిపోయినట్టు తేలికగా నిట్టూర్చారు. వారి ముఖాలలోకి క్రొత్త సంతోషం కాంతి వచ్చాయి. అందరూ నెమ్మదిగా లోపలికి వచ్చారు. "మీనాక్షీ! నీకేం ఫరవాలేదుట నాలుగు రోజుల్లో ఇంటికి వెళ్ళిపోవచ్చునన్నారు డాక్టరుగారు." కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా బొంగురు గొంతుతో అన్నాడు పార్ధసారధి.

మీనాక్షి కళ్ళు తెరిచి ఆయన వైపు చూసింది. ఆ కళ్ళలోకి జీవ కాంతి వచ్చింది. "మీరు ఇన్ని సార్లు పైకి క్రిందికి తిరగకండి. పిల్లలు చూసుకుంటారు అన్నీ. మీరు విశ్రాంతి తీసుకోండి"అంది మొగుడితో.

హాస్పిటల్‌లో చేరిన నలభై ఎనిమిది గంటలలో ఆమె మాట్లాడిన మొదటి మాటలు అవి.

వారిజ తల్లి దగ్గరకు వచ్చి ఆవిడ చెంపలు నిమిరింది. "దేవుడు నిన్ను కాపాడి మాకు అమ్మని ఇచ్చాడు" అంది ఏడుపు నవ్వు కలిసిన గొంతుతో.

"నువ్వు వట్టి మనిషివి కావు... ఏ దిగులూ మనసులో పెట్టుకోకూడదు. నీకు అయిదో నెలలోనే సీమంతం చేస్తాను. నాచేతులతో నీకు మల్లెల జడ కుడతాను. నా

కూతురి సీమంతం పెళ్లిలా ఘనంగా చేస్తాను అంది మీనాక్షి నెమ్మదిగా.

నీరజ తల్లి చేతిని తన చేతిలోకి తీసుకొని నిశ్శబ్దంగా కూర్చుంది. ఆ పిల్ల కళ్ళ నిండా నీళ్ళున్నాయి.

"కాబోయే పెళ్ళికూతురివి కళ్ళనీళ్ళు పెట్టడం అశుభం. నా ఇంట్లో జరిగే ఆఖరి పెళ్ళి నీది. మీనాక్షి చేసినట్టు ఎవరూ చేయలేదు అన్నంత గొప్పగా చేస్తాను నీ పెళ్ళి" నీరజతో అంది మీనాక్షి.

"అత్తయ్యా...మీరు మాట్లాడుతుంటే మాకు ప్రాణం లేచి వచ్చినట్టుంది." అంది అలకనంద.

"అవునమ్మా...రెండ్రోజులుగా మాటే ఆడలేదు నువ్వు....భయపడిపోయాం" శేషగిరి చిన్నపిల్లాడిలా అన్నాడు.

"అలకా! వచ్చే నెలలో మనందరం తిరుపతి వెడదాం" అంది మీనాక్షి కోడలితో.

"నాన్నా శేషూ! దేవుడు నీకు ప్రమోషన్ ఇచ్చి ఆఫీసర్ని చేసాడు. నాకూ మనువడు పుట్టేదాకా శనివారాలు ఉపవాసాలు వుంటానని దేవుడికి మొక్కుకున్నానురా..." అన్నదావిడ కొడుకుతో.

ఆమె ఉత్సాహం,ఆనందం చూస్తుంటే వాళ్ళందరికీ కొత్తగా ఆశ్చర్యంగా వుంది.

మనిషి తనను తాను ప్రేమించినంతగా ఎవరినీ ప్రేమించలేదు. 'నేను' అనేదే బ్రతుకులోని తీపి.